క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొందుర్గు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని రేగడిచిల్కమర్రిలో మైసమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అవాహిత పూజా, చండిహోమం, మంటప హోమాలు, రుద్రహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తిభావంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన



హోమాలు నిర్వహిస్తున్న పూజారులు

మొయినాబాద్: మండలంలోని అప్పోజీగూడలో బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మండపారాధన మహోత్సవాలు, జలాధివాసము, ధాన్యాధివాసము, హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: గీత కార్మికులకు బీమా, హైదరాబాద్‌లో నీరా కేఫ్ ఏర్పాటు చేయడంతో గురువారం పట్టణంలో గౌడ సంఘం నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివరాములుగౌడ్, ప్రకాష్‌గౌడ్, శివలింగంగౌడ్, శ్రీనివాస్, రాములుగౌడ్, రామస్వామి, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, మారుతీ గౌడ్, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగి నాలాను కబ్జా చేస్తే చర్యలు తప్పవు



ప్రీకాస్టు వాల్‌ను కూల్చివేస్తున్న అధికారులు

శంకర్‌పల్లి: ఫిరంగి నాలాను కబ్జా చేస్తే చర్యలు తప్పవని శంకర్‌పల్లి నీటిపారుదల శాఖ ఏఈ రాధిక, మండల ఆర్ఐ తేజ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం, మండల పరిధిలోని గోపులారం, మిర్జాగూడ, జనవాడ, మహారాజ్‌పేట్ గ్రామాల్లో ఉన్న ఫిరంగి నాలాను కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ, ప్రీకాస్టు వాల్స్‌ను అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలా బఫర్ జోన్‌ను వదిలిపెట్టి నిర్మాణాలను చేసుకోవాలని సూచించారు. నాలాలు, వాగులు, ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె గురువారం 7వ రోజు కొనసాగుతోంది. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జేపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే మన ఉద్యోగాలు మనవేనని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులను పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, వసంతం, పెంటారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎం. శ్రీను, ఆగిరెడ్డి, మల్లేశ్, వీరేందర్‌రెడ్డి, ఎస్. శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా సెల్‌టవర్ల ఏర్పాటు

- అనారోగ్యాల బారిన ప్రజలు
- పన్నులు సైతం చెల్లించని వైనం



జనావాసాల మధ్యన ఏర్పాటు చేసిన టవర్

కొత్తూరు: మండలంలో ఇప్పటికే పలు పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇళ్ల మధ్యలో కొత్తగా సెల్‌ఫోన్ టవర్లను నిర్మిస్తున్నారు. దీంతో మండల ప్రజలు పరిశ్రమల కాలుష్యం, సెల్ టవర్ల నుంచి వెలువడే రేడియేషన్ కారణంగా మరిన్ని వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు మండల కేంద్రానికే పరిమితమైన టవర్లు ఆయా కంపెనీల మధ్య పోటీతత్వం పెరగడంతో కొత్త కస్టమర్లు, నాణ్యమైన సేవలు అందించాలనే దృక్పథంతో ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో కూడా టవర్లను ఏర్పాటు చేస్తున్నారు.

రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యాలు..

ఇళ్ల మధ్యన సెల్‌ఫోన్ టవర్ల ఏర్పాటుతో రేడియేషన్ ప్రభావం వల్ల సమీపంలో నివసించే ప్రజలు తరచుగా అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఇటీవల ఆయా ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించిన పలు వైద్య బృందాలు వెల్లడించాయి. రేడియేషన్ ప్రభావం ఎక్కువైతే పలు రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని తరచుగా డాక్టర్లు వైద్య శిబిరాలు, సమావేశాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఇళ్లపై ఏర్పాటు చేసిన టవర్లపై సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాకుండా భారీ ఈదురుగాలులు వీచిన సమయంలో పలుచోట్ల సెల్‌టవర్లు విరిగి ఇళ్లపై పడిన సంఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. టవర్ల యాజమానులు నెలనెల పెద్దమొత్తంలో అద్దె చెల్లిస్తుండడంతో వీరు కిమ్మనడం లేదు.

పన్నులు చెల్లించడం లేదు..

మండలంలో ఇప్పటికే పదుల సంఖ్యలో ఆయా కంపెనీల సెల్‌టవర్లు ఏర్పాటు చేశారు. కొందరు పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోగా మరికొందరు నాయకులకు ముడుపులు చెల్లించి టవర్లను ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం నిర్వాహకులు మున్సిపాలిటీ, పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఒక టవర్ సామర్థ్యాన్ని బట్టి సంబంధిత పంచాయతీకి పన్నుల రూపంలో సుమారుగా రూ.10 వేలు చెల్లించాలి. మండలంలో చాలా వరకు టవర్ల నిర్వాహకులు పన్నులు చెల్లించడం లేదు.



ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన టవర్

నోటీసులు జారీ చేస్తాం



మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న సెల్‌టవర్ల నిర్వాహకులకు మున్సిపల్ చట్టం ప్రకారం పన్నులు చెల్లించాలని త్వరలో నోటీసులు జారీ చేస్తాం. చట్టంలో సెల్‌టవర్ల నుంచి పన్నులు వసూలు చేయొద్దనే నిబంధనలు ఉంటే వాటికి మినహాయింపు ఇవ్వడం జరుగుతుంది.

– లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తూరు



హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో బుధవారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా హైబిజ్ టీవీ మీడియా పురస్కారాన్ని హోంమంత్రి మహమూద్‌అలీ, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకుంటున్న సాక్షి ప్రకటనల విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పొట్టిగారి కృష్ణారెడ్డి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్

షాద్‌నగర్: అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ సంఘం నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎంతో కాలంగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడంతో పాటుగా, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు మల్లేశ్, నరేష్, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, రమేశ్, మల్లేశ్, శివ, భరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేపట్టిన జర్నలిస్టులు

కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గణేశ్ తదితరులు

జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్

నందిగామ: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండలంలోని చేగూరు పీఏసీఎస్‌లో చైర్మన్ అశోక్ ఆధ్వర్యంలో గురువారం ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2080, గ్రేడ్-బీ రకానికి రూ.2040, మొక్కజొన్నకు రూ.1962 మద్దతు ధర ప్రకటించిందని, ఈ ధరకు పీఏసీఎస్‌ల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వివరించారు. చేగూరు పరిసర గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్, సర్పంచులు గోవింద అశోక్, కుమార్, డైరెక్టర్ నర్సింహా, సీఈఓ వెంకటయ్య, నాయకులు వీరేందర్, విజయ్, సాములయ్య, యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

సినీ నటుడు కొమరయ్య

చేవెళ్ల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సినీ నటుడు కొమరయ్య అన్నారు. మండలకేంద్రంలో గత నెలరోజులుగా జరుగుతున్న కనకమామిడి వెంకట్‌రెడ్డి–మాడి రంగారెడ్డిల సంయుక్త మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన నటుడు కొమరయ్య గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన మొయినాబాద్ జట్టుకు లక్షరూపాయల నగదు, షీల్డులను, రెండవ బహుమతి చేవెళ్ల స్ట్రైకర్స్ జట్టుకు 50వేల నగదు, షీల్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కల్గుతోందన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. యువత క్రీడ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. నిర్వాహకులు కనకమామిడి మల్లారెడ్డి, కె. శ్రీనివాస్‌రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, అనంత్‌రెడ్డి, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, విఠలయ్య, అనంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అశ్విన్‌కుమార్, వెంకట్‌రెడ్డి కిట్టు, వంశీ, అమరేందర్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న కొమరయ్య, తదితరులు

‘చలో బుద్ధవనం’ విజయవంతం చేయండి

మొయినాబాద్: గౌతమ బుద్ధుడి 2567వ జయంతి సందర్భంగా నేడు (శుక్రవారం) కారు ర్యాలీని నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నుంచి నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం వరకు నిర్వహించే కారు ర్యాలీని విజయవంతం చేయాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..యువజన సంఘాల నాయకులు, అంబేడ్కర్‌వాదులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రియాంక సభను విజయవంతం చేయండి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్నరెడ్డి

నియోజకవర్గం ఇన్‌చార్జి జ్యోత్స్నరెడ్డి

చేవెళ్ల: ఈ నెల 8న కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమస్యలపై చేపట్టే దీక్షకు రానున్న ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గం ఇన్‌చార్జి జ్యోత్స్నరెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డిలు అన్నారు. మండలకేంద్రంలో గురువారం నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకులతో సభకు సంబంధించిన సన్నహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సరూర్‌నగర్‌లో జరిగే ఈ సభకు పెద్ద ఎత్తున యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేలా చూడాలన్నారు. అన్ని మండలాల నాయకులు సమాయత్తం కావాలని చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు, యూత్ అధ్యక్షుడు పార్టీ ముఖ్యనాయకులు అంతా సమన్వయంతో యువతను పెద్ద ఎత్తున తరలించేందుకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ దీక్షను విజయవంతం చేసి కాంగ్రెస్ పార్టీ బలాన్ని నిరూపించుకోవాలని చెప్పారు. చేవెళ్ల నుంచి పెద్ద సంఖ్యలో జనం రావాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు పి. వెంకటస్వామి, టీపీసీసీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, వసంతం, దర్శన్, డీసీసీ ఉదయ్‌మోహన్‌రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రభుత్వంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అశన్నగౌడ్, దేవునిపల్లి, ఎల్లంపల్లి గ్రామాల సర్పంచులు రాఘవేందర్‌గౌడ్, కృష్ణయ్య, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పీర్లగూడ గ్రామ నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైతే తెలంగాణ ప్రాంతం పూర్తిగా వెనకబాటుకు గురవుతుందని ఆరోపించిన వివిధ పార్టీల నేతలు ప్రస్తుతం సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతూ ఉద్యోగ అవకాశాల కల్పిస్తుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో లక్షా 33వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అదేవిధంగా, పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి మొదట బీజం వేసింది సీఎం కేసీఆర్‌నని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, కరివెన, ఉద్దండాపూర్ వద్ద పనులు పూర్తి కాగానే లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రతి పక్షపార్టీల నేతలకు ఏమాత్రం అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఆరోపించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బస్తీబాట కార్యక్రమం పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధిలో దేశానికే రాష్ట్రం రోల్‌మోడల్

కేశంపేట: రాష్ట్రాభివృద్ధి దేశానికే ఆదర్శంగా ఉందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల రోడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కేశంపేట నుంచి పెద్దరేవళి వరకు 5.63 కోట్లు, శ్యాంరావుతండా నుంచి ఆమనగల్లు రోడ్డు వరకు 1.40 కోట్లు, కేశంపేట నుంచి చౌలిపల్లికి 3.59కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, పల్లె నర్సింగ్‌రావు, లక్ష్మీనారాయణ, సాజిద్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’తో పేదలకు లబ్ధి



కంటివెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్ నవీన్‌కుమార్

సర్పంచ్ నవీన్‌కుమార్

కేశంపేట: కంటివెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపేటలో గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలను నిర్వహించి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామంలో అర్హులైన వారు ఆధార్‌కార్డుతో వచ్చి కంటి పరీక్షలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, ఉప సర్పంచ్ నరేష్ యాదవ్, జగన్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్, ఎఎన్‌ఎం పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: భట్టి విక్రమార్కను ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ గురువారం కలిశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఈనెల 6,7 తేదీల్లో భట్టి చేపట్టనున్న పాదయాత్రపై ఇరువురు చర్చించారు. 6న బాట సింగారం నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు వచ్చి బస చేస్తారని, 7న పెద్దంబర్‌పేట, హయత్‌నగర్ మీదుగా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఇబ్రహీంపట్నం: సృజనాత్మతను పెంపొందించుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని గీతం యూనివర్సిటీ డీన్, ప్రొ.మంజునాథచారి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్‌లో గల సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులపై అంతర్జాతీయ సదస్సును రెండు రోజుల పాటు నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపు సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన చారి మాట్లాడుతూ.. నేటి పోటీ సమాజంలో విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. కళాశాల చైర్మన్ నాగయ్య, కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ శేఖర్‌బాబు, కన్వీనర్ డా.సుబ్బారావు, అంజయ్, పీసీ రావు, కిష్టయ్య పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ఈ సందర్భంగా అందజేశారు.